# కనకపు గట్టు

ఉదయం ఎనిమిదిగంటలు అయ్యేసరికి ప్రెస్‌కు వెళ్ళాలి. ఒక్కక్షణం ఆలస్యం అయినా మిర్రిమిర్రి చూస్తాడు టైంకీపర్. పదినిమిషాలు దాటిందంటే ఇంక ఆ పూటకు పనిచేసే ప్రాప్తం వుండదు. పనిచేయక పోతే కడుపు నిండదు. ఆ మాట సరేసరి.

అప్పుడే గడియారం ఏడున్నర చూపిస్తోంది. ఎప్పుడో ఇక్ష్వాకుల కాలంలో తయారయిన గడియారం అది. ఎంత ఆలస్యంగా తయారు అవుతున్నాడో తెలుసుకుందుకు తప్ప యింకెందుకు పనికిరాదు.

"పక్కయింటికి వెళ్ళి టైం ఎంత అయిందో కనుక్కు రమ్మంటావా నాన్నా" అన్నాడు పదేళ్ళకొడుకు.

ముద్దు అనిపించింది. అమాంతం వాడిని ఎత్తుకుని తిప్పుదాం అనుకున్నాడు. వాడి ముఖంలోకి చూచి ఆగిపోయాడు. ఆ కళ్ళలో యేదో కోరిక.

రోజూ నాలుగుసార్లు చెబితేతప్ప ఒక్కమారయినా తొంగి చూడటానికి బద్దకించే వాడేనా వీడూ ప్రతిరోజూ టైంఎంత అయిందో తెలియక ఉరుకులూ పరుగులూను.

"ఈ సంవత్సరం బోనస్‌లో అయినా ఓ గడియారం కొనుక్కోండి. ఈ రోజుల్లో ప్రతిచేతికి ఆడ మగ తేడా లేకుండా గడియారం వుంటూంది! అంకెలు రానివాళ్లు కూడా అంటూ ప్రారంభం చేసింది భార్య.

ఈ మాటలు దాదాపు రోజూ వింటూవున్నవే. చెవులు కాయలుకాశాయి. ప్రతి సంవత్సరమూ బోనస్ వస్తోంది. దానికంటేముందు యేవేవో అవసరాలు తిష్టవేసుకు కూర్చుని వచ్చిందని కూడా తెలియకుండానే ఆకాస్త డబ్బూ కరిగిపోతోంది.

గబ గబ కాఫీ తాగి బయలుదేరాడు.

"ఈ రోజు ఆలస్యం కాలేదు" అంది భార్య.

ధైర్యం చెప్పటానికి అన్నదో యేమో! ఆలస్యం అయిందో లేదో ప్రెస్ గుమ్మంలో వెళ్ళి పడితేగాని తెలియదు.

"సాయంత్రం అయినా నాలుగు డబ్బులు పట్టుకు వస్తారు కదూ!"— సన్నగా భార్యగొంతు.

భార్యలు డబ్బు సంగతి తప్ప యింకేం మాట్లాడినా అందంగానే వుంటుంది. డబ్బు ప్రసక్తి వచ్చేసరికి ఋణానుబంధం రూపేణా పతి పత్ని సుదాలయం" అని గుర్తుతెస్తుంది.

అతను యేమీ జవాబు చెప్పలేదు.

"వీలయితే చూడండి. అంటూ భార్య నెత్తిమీద కూర్చున్న కార్డుల జాబితా వప్పగించింది.

అతను వినిపించుకోలేదు. ఈ వివరాలన్నీ అవసరంలేదు. చెప్పులు వేసుకు బయలుదేరబోతూ వుండగా కొడుకు 'నాన్నా, నాకో రూపాయి యివ్వవూ?' అన్నాడు. జేబులు వెదకగా మూడు పదిపైసల నాణేలు తగిలాయి.

ఒకబిళ్ళ వాడికి అందించాడు. వాడు యింత ఆప్యాయంగా యెందుకు టైం చూచి వస్తానన్నాడో యిప్పుడు పూర్తిగా అర్థం అయింది.

పోతే, దగ్గర ఉన్నది యిరవై పైసలు. సిటీబస్‌కు కూడా సరిపోవు. పదిపైసలు వాడికి యివ్వకుండా వుంటే తప్పేది.

పోనీలే పది పైసలేగా!

గబ గబ నాలుగు అడుగులు వేస్తే సరిపోతుంది.

పసిపిల్లాడు పదిపైసలు అడిగినపుడు యివ్వకపోతే ...

ప్రెస్‌కు చేరుకోవడం ఆలస్యం అవుతుందేమోనన్న ఆదుర్దా యిప్పుడు లేదు. పదినిమిషాలు ఆలస్యం అయినా యిబ్బందిలేదు నిజానికి.

టైంకీపర్ మిర్రిమిర్రి చూస్తే మటుకు మునిగిపోయింది యేముంది?

కన్నకొడుకు అడిగినపుడు పదిపైసలు యివ్వలేక పోవడం కంటే అదేం ఎక్కువ అపరాధం కాదుగదా.

స్కూలు ఫైనల్ పరీక్ష ప్యాసయి, ప్రెస్‌లో 'కంపోజిటర్' గా పని చేస్తున్నవాడు ఒక్కడే అక్కడ. తతిమ్మా వాళ్ళంతా 'అక్షర జ్ఞానం' మాత్రం వున్నవాళ్ళు. అలవాటు కొద్దీ యాంత్రికంగా అక్షరాలు కూరుస్తారు.

'చదువుకున్న వాళ్ళకయితే ఎక్కువ అనుమానాలు-' అంటాడు మేనేజర్. యేదయినా అడిగినపుడు.

అక్షరాలు వున్నది ఉన్నట్లుగా కూర్చటానికి పెద్ద 'చదువు' అవసరం లేదు. అక్షరాలు గుర్తుపట్టగలిగితే చాలు. అంతకంటే ముఖ్యం. టైప్‌ప్రెస్-పాయింట్స్ తెలిసివుండాలి.

లోయర్ కేస్- అప్పర్‌కేస్- కాపిటల్- బోల్డ్ టైమ్స్- రోమన్- బాస్కర్ విల్లి- ఇటాలిక్- స్క్రిప్ట్- యిలాంటిపేర్లు తెలుసుకుని వాటిని గుర్తు పట్టగలిగితే చాలు.

పోలీసు కుక్కకు దొంగ అవసరాలతో నిమిత్తం లేదు. రూప లావణ్యాలతో అసలు పనేలేదు.

ఏదో సామెత చెప్పినట్లు 'పప్పుగుత్తి'కి రుచులు ఏం తెలుస్తాయి? కంపోజిటర్‌కు అది వేదాంత గ్రంథం అయినా బూతు పుస్తకం ఒక్కటే. సాయంత్రం గంట కొట్టేసరికి చేయవలసిన పేజీలు పూర్తిచేసి లెక్కచెప్పడం చేతనవాలి.

ఇవన్నీ అనేక మార్లు మనసులో గుణించుకున్నాడు. మరిచిపోకుండా వుండడం కోసం అప్పుడప్పుడు మననం చేసుకుంటూ వుంటాడు.

'యూనిఫారం' వేసుకుని కంపోజింగ్ గదిలోనికి వెళ్ళాడు. తోటి వర్కర్లు నలుగురూ అప్పుడే పనిలో మునిగిపోయి వున్నారు.

'ఫోర్‌మన్' యితన్ని చూడడంతోటే నిన్నటి గ్యాలీలన్నీ కరెక్షన్ అయివచ్చాయి. ఈ రోజు వాటి పనిచూడు-' అన్నాడు.

యాంత్రికంగా గ్యాలీల కట్ట అందుకున్నాడు.

'మధ్యాహ్నానికి ఏ కరెక్షన్ అయిపోతే, సాయంత్రం లోపల 'ఫారమ్' కట్టి మిషన్ మీదకు యెక్కించమన్నాడు మేనేజర్-' అన్నాడు ఫోర్‌మన్ మళ్ళీ. 'ఏం అట్టా వున్నావేం? వంట్లో బాగాలేదా?'

'బాగానే వుంది. కాస్త తలనెప్పి. అంతే.'

'అలాగా, పాపం. నా దగ్గర సారిడాన్ మాత్ర వుండాలి కాఫీ టైంలో అడుగు యిస్తాను.

తల ఊపాడు.

'నీకు నోట్లో నాలుక లేదు. అన్నిటికీ గంగిరెద్దులా తల ఊపుతావు. ఇలా అయితే యెట్లా బతుకుతావు?'

యెట్లావున్నా బతకడం మటుకు అసాధ్యం. ఏమిటో....ఎన్నాళ్ళో ...

'నువ్వు చదివిన చదువుకు యేదయినా ఆఫీసులో గుమాస్తాగా చేరితే బాగుండేది. అలాంటిచోట్ల అయితే బొత్తిగా అన్నానికి మాడి చావవలసిన అవసరం లేదు-' అంటారు ప్రెస్‌లో యితర వర్కర్లు.

స్కూలు ఫైనల్‌కూడా వాళ్ళకు పెద్ద చదువులా కనిపిస్తుంది. తన దౌర్భాగ్యం కొద్దీ! ఎం.ఏ.లు చేసినవాళ్ళు గుమాస్తా ఉద్యోగాలు దొరకక అవస్థలు పడుతూ వుండడం వాళ్ళకు తెలియదా?.... అలాంటి ఆఫీసుల్లో అయితే పదిమందిలో తను యిలాంటి చదువు చదువుకొని వాళ్ళదగ్గర చంద్రుడిలా వెలిగిపోతున్నాడు.

ఎవరయినా ఉత్తరం వ్రాయాలన్నా. లెక్కపత్రం చదవాలన్నా తననే అడుగుతారు పెద్దగాచేసి.

అంతమాత్రం చేత గొప్పవాడు అయిపోతాడా?

పదిగంటలు కొట్టేసరికి 'టీ' సమయం.

ఫోర్‌మన్ గుర్తుచేసి తలనొప్పి మాత్ర యివ్వబోయాడు.

'ఇపుడు తలనొప్పి లేదు. వద్దులెండి. అవసరం వచ్చినపుడు తీసుకుంటాను-' అన్నాడు.

'పనిలో మునిగిపోయేటప్పటికీ తలనొప్పి కాస్తా మటుమాయం అయిపోయింది. పనివాడంటే నీలా వుండాలి. తతిమ్మావాళ్ళను చూడు, యెంత సోమరిపోతులో' అన్నాడు ఫోర్‌మన్ మెచ్చుకోలుగా.

టీ తాగి మళ్ళీ పనిలో ప్రవేశించాడు.

అప్పుడప్పుడు తలనెప్పి రావడం మంచిదే. తల వున్నది సుమా-అని గుర్తుచేస్తుంది. బొత్తిగా తలకాయ లేనివాళ్ళకూడా తలనెప్పివస్తుందా? నవ్వుకున్నాడు.

'నీకు జీతం ఎక్కువ చేయమని చెప్పాడు ఫోర్‌మన్, బాగా పనిచేస్తు

న్నావని. తప్పకుండా గుర్తుపెట్టుకుంటాను-' అన్నాడు మేనేజర్. మధ్యాహ్నం 'రోండ్స్'కు వచ్చినపుడు.

'థాంక్సండీ. అన్నాడు వినయంగా.

ఈ మాట అతనికి సంతోషం కలిగించలేదు.

జీతం ఎక్కువ చేయడం అంటే-వందలు, వేలు కాదని తెలుసు. మహా ఎక్కువ అయితే పదిరూపాయలు పెరుగుతుంది. ఈ పది రూపాయలతో 'దరిద్రం' తీరిపోతుందా.

ఆ మాటకు వస్తే- ఎంత డబ్బు వుంటే 'దరిద్రం' తీరుతుందో లెక్కవేసుకుందామని అప్పుడప్పుడు అనిపిస్తూ వుంటుంది. కాగితం, కలం తీసుకుని కూర్చుంటాడు. జాబితా ఆంజనేయులు తోకలాగ పెరిగిపోతుంది. కావలసిన వస్తువులు వాటి ధరలు రాసుకుంటూ పోతాడు. ఎంతవరకు రాసుకుంటూ పోతాడంటే.... చేతిలోకి తీసుకున్న కాగితం మీద యింక చోటు వుండదు. ఆ అంకెలన్నీ కలిపి కూడటానికి మనసుకు ఓపిక వుండదు. విసుగ్గా కాగితాన్ని ఉండచుట్టి ఎవరూచూడకుండా అవతల పారవేస్తాడు. అక్కడితో ఆ ఆలోచన చచ్చిపోతుంది.

మధ్యాహ్నం అందరితోపాటు భోజనానికి కూర్చున్నాడు.

కాంటీన్ భోజనం రుచిగా లేకపోయినా కడుపునిండా దొరుకుతుంది. భోజనం అయినాక అరటిపండు కొనుక్కుంటారు చాలామంది వర్కర్లు. ఆపైన సిగరెట్ పీలుస్తారు.

ఈ రెండూ అలవాటులేవు అతనికి. కాస్సేపు అటుయిటు తిరుగుతాడు' లైబ్రరీకి వెళ్ళి పేపరు తిరగవేస్తాడు. మళ్ళీ గంటకొట్టేసరికి 'కంపోజింగ్, హాలులోకి వచ్చి 'స్టిక్' చేతపట్టుకుంటాడు.

సాయంత్రం నాలుగు గంటలకు మేనేజర్ కబురుపంపాడు.

'నీకు టైప్ చేయడం వచ్చునా?' అనడిగాడు. చేతుల్తో అభినయం కూడా చేస్తూ.

'వచ్చును. ఇక్కడకు రాకముందు ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళి నేర్చుకున్నాను.'

'ఇంకా నేర్చుకుంటున్నావా?'

'ఉహు'

'ఏమయినా పరీక్షలు ప్యాసయినావా?'

'లేదు'

మేనేజరు ముఖంలో కాస్త చిరాకు.

'నేర్చుకోవడం ఆపకుండా వుండాల్సింది.'

ఎందుకని? అన్నట్లు చూశాడు.

ఎందుకు 'కంటిన్యూ' చేయలేకపోయాడో మనసుకు తెలుసు.

సమయం లేకపోవడం.

ఫీజుకు డబ్బు లేకపోవడం.

పెళ్ళి కావడం.

పిల్లలు పుట్టుకు రావడం.... యిలా ఎన్నో....ఎన్నో....

'సరే. ఈ రోజునుండి మళ్ళీవెళ్ళు. ఒక్క నెలరోజులు మళ్ళీ అభ్యాసం చేస్తే దారిలో పడతావనే ధైర్యం వుందా?'

'వారం రోజులు చాలు' ఎంతో ధీమా.

'రైట్ నీకు ఫీజు, అదీ కావాలంటే ఆఫీసులో అడిగితీసుకో. నేను చెబుతాను. ఈ రోజునుండే స్కూలుకు వెళ్ళు.

తల ఊపాడు.

కాని యింకా అయోమయంగానే వుంది. ఎందుకు టైప్ నేర్చుకోవాలి?

మేనేజరుకు యింత శ్రద్ధ ఎందుకు?

ఏ జన్మలో ఏ పాపపుణ్యాలు చేశాడో?

ఈ ప్రశ్నలు మనసులోనే వేధిస్తూ వుండగా, మేనేజరుకు ఎదురుగా నిలిచాడు, అడగలేక.

'మన ప్రెస్‌లో ఫోటోటైప్ సెట్టింగ్ యంత్రం తెప్పిస్తున్నాం. దానికి అక్షరాలు చేతులతో కూర్చడం కాదు. మోనోలో మాదిరిగా మెటల్‌కరిగించి చట్రాలలో పోయడమూ కాదు. నీవు మిషన్‌మీద అక్షరాలు టైప్ చేసుకుంటూ పోతే, ఫొటోగ్రాఫిక్ నెగిటివ్ తయారవుతుంది. దాన్నించే ప్లేట్ చేస్తారు....' అని వివరంగా చెబుతూ, 'నువ్వేం బెంగపెట్టుకోకు. టైప్ చేయడం చేతనయినవాళ్ళకు ఈ యంత్రంమీద పనిచేయడం సులభం అయినా రెండునెలలపాటు బొంబాయి పంపించి నీకు ట్రెయినింగ్ యిప్పిస్తాం భయపడకు. ఆ ఖర్చంతా కంపెనీ భరిస్తుంది. కాస్త మంచివాళ్ళకు మాత్రమే ఈ పని అప్పగించాలి.

అంతా అర్థం అయింది.

టైప్ సెట్టింగ్‌లో రకాలు వినివున్నాడు. చూడకపోయినా.

తరువాత ఫోర్‌మన్ అన్నాడు. ఇకపైన నువ్వు కూర్చునేది. ఎయిర్ కండిషన్ గదిలో మామూలు కంపోజింగ్ హాల్‌లో నలుగురితోపాటు నిలబడి పనిచేయవలసిన అవసరం లేదు.

యథాలాపంగా అన్నట్లు అడిగాడు ఫోర్‌మన్ మళ్ళీ.

'మేనేజర్ జీతం ఎంతని చెప్పాడు?'

'ఏమీ అనలేదు'

'నువ్వు అడగలేదా?'

'ఊహూ'

'అందుకనే నీకు నోట్లో నాలుక లేదన్నాను.'

జవాబు చెప్పలేదు.

'ఆ పనికి తగినంత జీతం వాళ్ళేయిస్తారు అనుకుంటున్నావా?అడగనిదే అమ్మయినా పెట్టదు- అని సామెత!'

అడిగినా పెట్టని అమ్మలను కూడా తను ఎరుగును. బహుశ ఈసంగతి ఫోర్‌మన్‌కు తెలియకపోవచ్చు.

'ఈసారి సందర్భం వచ్చినపుడు అడిగితేల్చుకో. లేకపోతే మోసం చేస్తారు.'

ఈ మారు యేమీ మాట్లాడలేదు.

'నాకు ప్రామిస్ చేయి, అడుగుతావా?' చేయి ముందుకు చాపాడు ఫోర్‌మెన్. నవ్వుతూ చేతిలో చేయివేస్తూ ప్రయత్నిస్తాను. నాకు నోట్లోనాలుక లేదన్నావుగా నువ్వు' అన్నాడు.

'నాలుకలేదు గాని, ఇంటిదగ్గర పెళ్ళాం పిల్లలు వున్నారు గదా! పొట్ట వుంది, సంసారబాధ్యతలు వున్నాయి.

ఇంకా తెలుసు. సంసార బాధ్యతలకు తోడు సాంఘిక బాధ్యతలూ వున్నాయి. అయినా ఎంత ప్రాప్తమో అంతే వస్తుందిగాని.... ఎంత అడిగితే అంత దక్కుతుందా?

యెంత అవసరమో అంత దొరుకుతుందా?- ఫోర్‌మన్‌కు భరోసా యిచ్చి ముందుకు కదిలాడు.

'ఈమాట నీ మనసులోనే వుంచుకో. అంతా నికరం అయ్యేంతవరకూ యింకెవరితోటీ అనకు. ఓర్వలేని వాళ్ళు చాలామంది వుంటారు-' అన్నాడు ఫోర్మన్.

తల ఊపాడు.

గంటకొట్టాక అందరితోపాటు అతనూ ప్రెస్‌నుండి బయటకునడిచాడు.

రోడ్డుమీద తలవంచుకు ముందుకు అడుగులు వేస్తున్నాడు. అప్పుడు గుర్తుకువచ్చింది. చాలాదూరం నడిచి, యింక అయిదారు నిమిషాలలో యిల్లు వస్తుందనగా గుర్తుకు వచ్చింది. డబ్బు తీసుకురమ్మని భార్య చెప్పినమాట! పని హడావిడిలో డబ్బు సంగతే మర్చిపోయాడు. రేపయినా గుర్తుపెట్టుకోవాలి. డబ్బు తీసుకువెళ్ళి భార్యకు యివ్వాలి- అనుకున్నాడు.

ఎయిర్ కండిషన్ గదిలో కూర్చుని పనిచేయవలసి వస్తుందనీ, జీతం కూడా వస్తే ఎక్కువ అవుతుందేమోనని భార్యతో చెప్పాలో అక్కర్లేదో మటుకు తెలియలేదు.

కుర్రవాడు బుద్ధిగా అరుగుమీదనే కూర్చుని సుమతీశతకంలో పద్యం వల్లెవేస్తున్నాడు.

'పెట్టిన దినముల లోపల
నట్టడవులనైన వచ్చు నానార్థములున్
పెట్టని దినమున కనకపు
గట్టెక్కిననేమి కలదు గదరా సుమతీ'

*